# మిరప

**వాతావరణం:** మిరపకు 10-35$^0$C ఉష్ణోగ్రత అనుకూలం. వెచ్చని తేమతో కూడిన వాతావరణం పండు పరిపక్వతను మెరుగుపరుస్తాయి. ఎండు మిరప కోసం వేసే పంటను ఖరీఫ్‌లో వేసుకోవడం మంచిది. పచ్చి మిరప కోసం సంవత్సరం పొడవునా సాగు చేసుకోవచ్చు.

ఈ పంట 850-1200 మి.మి. వార్షిక వర్షపాతం గల ప్రాంతాల్లో వర్షాధార పంటగా విజయవంతంగా పెంచవచ్చు. భారీ వర్షం కాయ ఏర్పడు దశను అడ్డుకుంటుంది. భారీ వర్షం వలన కాయలు కుళ్ళిపోతాయి.

ఘాటు మిరప కాయలు మంచు వాతావరణమును తట్టుకోలేవు. మట్టి ఉష్ణోగ్రత 10$^0$ సెం. ఉన్నట్లయితే మొక్కలో సాధారణ ఎదుగుదల ఉంటుంది, మిరప మొక్క పెరుగుదలకు 20-25$^0$ సెం. ఉష్ణోగ్రత ఎంతో అనుకూలమైనది. 30$^0$ సెం. ఉష్ణోగ్రత వద్ద మొక్క పైకి భాగాలు బాగానే ఉంటాయి, కానీ అది వేరు యొక్క ఎదుగుదలను అడ్డుకుంటుంది. ఒక వేళ ఉష్ణోగ్రత 37$^0$ సెం. దాటినట్లయితే కాపు దశను ఎంతో ప్రభావితం చేస్తుంది. దిగుబడి తగ్గిపోతుంది. ప్రతిరోజు 9-10 గంటల కాంతి మొక్క ఎదుగుదలను, మెరుగు పరుస్తుంది. దాంతో నాణ్యతా గల పంటతో పాటు 21-24% దిగుబడిని ఇస్తుంది.

**నేలలు:** మిరప పంటకు మురుగు నీరు పోయే వసతి గల నేలలు మరియు మంచి గాలి తగిలే మరియు నేలలు అనుకూలం. నీరు పోయే వసతి లేని నేలలు మంచివి కావు. దానివలన ఆకులు రాలిపోవడం, కాయలు రాలిపోవడం మరియు మొక్క పాలిపోయినట్లు కన్పిస్తాయి. బరువైన నేలలు వర్షాదార పంటకు అనుకూలం నీటి ఆదారపు పంటకు చల్క నేలలు, లంక భూములు, ఇసుకతో కూడిన ఒండ్రు నేలలు అనుకూలం. ఆమ్ల మరియు క్షార నేలలు మిరప పంటకు అనుకూలంగా ఉండవు ఉదజని సూచిక తప్పనిసరిగా 6.0-7.0 ఉండేలా చూసుకోవాలి. ఎక్కువ ద్రావణీయత కలిగిన నేలలు విత్తనం మొలకెత్తకుండా అడ్డుకుంటాయి. మరియు మొక్క ఎదిగే బలాన్ని కూడా తగిస్తుంది.

**నేలతయారి :** మిరపకు మెత్తటి దుక్కి కావాలి. 3-4 సార్లు దుక్కిదున్ని 2 సార్లు గుంటక తోలాలి. ఎకరాకు 10 టన్నుల పశువుల ఎరువు మరియు 100 కిలోల వేపపిండిని ఆఖరి దుక్కిలో వేసుకోవాలి.

**విత్తన మోతాదు :** నారుపెంచేందుకు సెంటుకు 650 గ్రాములు (ఒక ఎకరానికి సరిపడునారు). విత్తనం ఎదబెట్టేందుకు ఎకరాకు 2.5 కిలోల విత్తనం కావాలి. సంకరజాతి రకాలకు 200-250 గ్రా/హె. విత్తనం కావాలి.

**విత్తనశుద్ధి**

**వైరస్ నివారణకు విత్తన శుద్ధి :** విత్తనం ద్వారా వ్యాప్తి చెందే వైరస్‌ను నివారించడానికి ట్రైసోడియం ఆర్థోఫాస్ఫేట్‌తో విత్తన శుద్ధి చేయాలి. 150 గ్రా. మందును ఒక లీటరు నీటిలో కరిగించి అందులో ఒక కిలో మిరప విత్తనాలు వేసి 20 నిమిషాలు నానబెట్టాలి. తరువాత ఆ నీటిని తీసివేసి రెండుసార్లు మంచి నీటితో కడిగి తర్వాత విత్తనాన్ని నీడలో ఆరబెట్టాలి.

**రసం పీల్చే పురుగుల నివారణకు విత్తన శుద్ధి:** మిరప విత్తన శుద్ధి చేయటం వలన తక్కువ ఖర్చుతో మంచి ఫలితాలను పొందవచ్చు. విత్తన శుద్ధి చేయనట్లైతే, విత్తే ముందు ఒక సెంటు విస్తీర్ణానికి 80 గ్రా. ఫిప్రొనిల్

గుళికలు, 1 కిలో వేపపిండి చల్లాలి. దీని వలన భూసారం పెంపొందించడమే గాక రసం పీల్చే పురుగుల బారి నుండి నారుమడి దశలో మొక్కలను ఆరోగ్యవంతంగా పెంచవచ్చు.

**తెగుళ్ళ నివారణకు విత్తనశుద్ధి:** విత్తనం ద్వారా వ్యాపించే బూజుతెగుళ్ళ నివారణకు 3 గ్రా. మాంకోజెబ్ లేదా కాప్టాన్ మందును ఒక కిలో విత్తనానికి పట్టించి విత్తనశుద్ధి చేసుకోవాలి.

ఒక సెంటు నారుమడికి 650 గ్రా. విత్తనం సరిపోతుంది. విత్తనం చల్లిన తరువాత మట్టిని తిరగగొట్టి 1 లేదా 1.5 సెం.మీ. లోతుకు విత్తనం పోవునట్లుగా చేసి సన్నని ఇసుక లేదా పశువుల ఎరువును పై కప్పుగా వేసినట్లైతే మొలకశాతం పెరుగుతుంది. ఆ తరువాత రోలరుతో మడులన్నీ గట్టిగా చదును చేయాలి. అధిక ఉష్ణోగ్రతలు ఉన్నప్పుడు నారుమడిని వరిచెత్తతో కప్పితే తేమ నష్టపోకుండా కాపాడుతుంది. మొక్క మొలకెత్తిన తర్వాత వరిచెత్తను తీసివేయాలి.

నారు మడిదశలో ముఖ్యంగా ఆశించే నారుకుళ్ళు తెగులు నివారణకు నాటిన 9వ రోజు, 10వ రోజు కాపర్ ఆక్సీక్లోరైడ్ 30 గ్రా. 10 లీ. నీటిలో కలిపి భూమిలో ఇంకేటట్లు తడపాలి. ఇటీవలి కాలంలో నారుమడి దశలోనే కోనోఫోరా ఎండుతెగులు గమనించడం జరిగింది. సాధారణ రకాలలో విత్తిన 30 రోజుల తర్వాత, హైబ్రిడ్ రకాలలో 20 రోజుల తర్వాత ఈ తెగులు కనిపిస్తుంది. తెగులు సోకిన మొక్కల కాండం మీద బూజు ఏర్పడి అది ఇరువైపులా వ్యాపించి కొత్తకొమ్మలు, రెమ్మలు ఏర్పడకుండా చేస్తూ నష్టాన్ని కలిగిస్తుంది. దీని నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 30 గ్రా, ఒక గ్రాము స్ట్రెప్టోసైక్లిన్ 10 లీటర్ల నీటితో కలిపి వారం రోజుల వ్యవధిలో 2 లేక 3 సార్లు పిచికారి చేయాలి.

**నారుమడి యాజమాన్యం :** ఎకరానికి 10 టన్నుల పశువుల ఎరువు వేయాలి. ఒక మీటరు వెడల్పు, 15 సెం.మీ. ఎత్తు ఉండేటట్లు ఎత్తైన నారుమడులు చేసి మధ్యలో 30 సెం.మీ. కాలువలు తీయాలి. సెంటు నారుమడిలో 650 గ్రా. విత్తనం చల్లుకోవాలి. విత్తనంతో పాటు సెంటు నారుమడికి 80గ్రా. ఫిప్రొనిల్ గుళికలను వాడినచో రసం పీల్చు పురుగులను (నల్లి తప్ప) నివారించవచ్చు.

సెంటుకు 1 కిలో వేపపిండి వేయాలి. ఒక శాతం బోర్డోమిశ్రమం లేదా 3 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్‌ను లీటరు నీటిలో కలిపి నీళ్ళతో నారుమడిని 9వ రోజు, 13వ రోజు తడపాలి. ఆరు వారాల వయస్సుగల మొక్కలు నాటుకోవాలి.

**రకాలు**

**జి-3 :** పొడవు కాయలు, వర్షాధారపు పైరుకు అనుకూలం. దిగుబడి వర్షాధారంగా 6-7 క్వి/ఎకరాకు, నీటి వసతి కింద 15-18 క్వి/హె.

**జి-4 (భాగ్యలక్ష్మి) :** కాయలు సన్నగా, పొడవుగా ఉంటాయి. పచ్చికాయకు, ఎండుకాయకు అనుకూలం. వైరస్‌ను తట్టుకొంటుంది. దిగుబడి 40-45 క్వి/హె.

**జి-5 (ఆంధ్రజ్యోతి) :** కాయలు పొట్టిగా, లావుగా ఉంటాయి. నెల్లూరు, చిత్తూరు, శ్రీకాకుళం, విశాఖపట్టణం జిల్లాల్లో నీటి వసతి కింద సాగుకి అనుకూలం. దిగుబడి 40-50 క్వి/హె.

**సి.ఎ. 960 (సింధూరు) :** కాయలు పొడవుగా, లావుగా ఉంటాయి. పచ్చిమిర్చికి, ఎండుమిర్చికి అనుకూలం. నీటి వసతి కింద వేయదగిన రకం. త్వరగా కాపు కొస్తుంది. కారం తక్కువ. వేసవి పైరుకు అనుకూలమైన రకం. దిగుబడి 50-55 క్వి/హె.

**ఎల్.సి.ఎ.-200 (కిరణ్) :** పొడవైన కాయలు, తెలంగాణ ప్రాంతంలో నీటి ఆధారపు పైరుకు అనుకూలం. దిగుబడి

40-45 క్వి/హె.

**సి.ఎ. 1068 (అపర్ణ) :** లావైన, పొడవైన కాయలు, తూర్పుగోదావరి, శ్రీకాకుళం జిల్లాల్లో నీటి వసతి కింద పచ్చిమిర్చి, ఎండుమిర్చిలకు అనుకూలం. దిగుబడి 35-40 క్వి/హె.

**యల్.సి.ఎ. 235 (భాస్కర్) :** కాయల పొడవు తక్కువ. కారం ఎక్కువ. ఆంధ్రప్రదేశ్‌లో వర్షాధారంగానూ మరియు నీటి వసతి కింద సాగుకు అనుకూలం. వైరస్‌ను బాగా తట్టుకొంటుంది. అన్ని జిల్లాలకు అనుకూలం. దిగుబడి 50-60 క్వి/హె.

**యల్.సి.ఎ. 206 (ప్రకాష్) :** పొడవైన కాయలు గల రకం. పచ్చిమిర్చికి, ఎండుమిర్చికి అనుకూలం. వర్షాధారం కింద, నీటి వసతి కింద సాగుకు అనుకూలమైన జాతీయరకం. దిగుబడి 45-50 క్వి/హె.

**యల్.సి.ఎ. 305 (లాం 305) :** పొడవైన, లావైన కాయలు కలిగిన రకం. పచ్చి మిర్చికి, ఎండుమిర్చికి, నీటి ఆధారపు పైరుకు అనుకూలం. దిగుబడి 50-60 క్వి/హె.

**యల్.సి.ఎ. 334 (లాం 334) :** ఈ రకము 2006 సంవత్సరములో లాం 334 పేరిట విడుదల చేయబడినది. మొక్కలు గుబురుగా, ఎత్తుగా పెరుగుతాయి. వైరస్‌ను తట్టుకుంటుంది. కాయలు 7-8 సెం.మీ. పొడవుతో మంచి ఎరుపు రంగు కలిగి వుంటాయి. వర్షాధారము మరియు నీటి వసతి గల అన్ని జిల్లాలలో సాగుకు అనుకూలము. ఎగుమతికి అనుకూలమైన రకము. ప్రతికూల వాతావరణ పరిస్థితులు కూడా తట్టుకొని సుస్థిర దిగుబడినివ్వగల రకము జాతీయ స్థాయిలో ప్రశాంత్ అనే పేరుతో విడుదల చేయబడినది. దిగుబడి 60-65 క్వి/హె.

**యల్ సి.ఎ 353 :** మొక్కలు గుబురుగా మధ్యస్థంగా వుంటాయి. కాయలు లేత ఆకుపచ్చ రంగులో 7 నుండి 9 సెం.మీ. పొడవుతో సన్నంగా ఉంటాయి. పచ్చిమిర్చికి మరియు ఎండుమిర్చికి అనువైన రకము. యల్.సి.ఎ. 334 రకము కన్నా 20-25 రోజులు ముందుగా కాపుకు వస్తుంది. కాయలు పండిన తరువాత మంచి నిగారింపుతో, ఆకర్షణీయమైన ఎరుపు రంగు కలిగి ఉంటాయి. జాతీయ స్థాయిలో లాం-353 అనే పేరుతో విడుదల చేయబడినది. దిగుబడి 60-65 క్వి/హె.

**పాప్రికా రకాలు :** పాప్రికా రకాల కాయలు లావుగా, పొడవుగా వుండి కారం తక్కువ, రంగు ఎక్కువగా ఉంటాయి. ఈ రకాలను ఊరగాయ పచ్చళ్ళు, సలాడ్స్ తయారీకి, ఓలియోరెసిన్‌కు ఎక్కువ వాడతారు. ఈ రకమునకు యూరోపియన్ మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంది. అంతర్జాతీయ మార్కెట్లో ఈ రకాల ప్రాముఖ్యం దృష్టిలో పెట్టుకొని లాంఫారంలో 1985వ సంవత్సరం నుండి ఎగుమతికి అనువైన రకాల రూపకల్పనకు చర్యలు చేపట్టడం జరిగింది. మన రాష్ట్రంలో తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాలలో పండించే లంక మిరప రకాలు, వరంగల్, కరీంనగర్ జిల్లాలో పండించే లావు కాయ రకాలను అమెరికా, జపాన్, పాప్రికా రకాలతో సంకరం చేసి మన రాష్ట్ర పరిస్థితులకు అనువైన రకాలను రూపొందించటం జరుగుతుంది. దీని ఫలితంగా ఎల్.సి.ఎ.424, ఎల్.సి.ఎ.436, ఎల్.సి.ఎ.444, ఎల్.సి.ఎ.435 లను గుర్తించటం జరిగింది.

**విడులకు సిద్ధంగా వున్న రకాలు :**

**యల్.సి.ఎ. 625 :** యల్.సి.ఎ 334 కంటే త్వరగా కాపుకు వచ్చును. మొక్కల కొమ్మలు బలిష్టంగా ఉండి ఎత్తుగా పెరుగును. కాయలు సన్నగా 8-10 సెం.మీ. పొడవుతో మంచి ఎరుపు రంగు కలిగి ఉండి, తాలు కాయల శాతం తక్కువగా ఉంటాయి. కారం అధికంగా (0.57%) ఉండి ఆకర్షణీయమైన ఎరుపు రంగు (1158 ఎఎస్‌టిఎ) కల్గి

కాయలు ఎక్కువ కాలం నిల్వ ఉంటాయి. ఎండు మిరపకు అనువైన అధిక దిగుబడి నివ్వ గల్గిన రకం (62-68 క్వి./హె).

**యల్.సి.ఎ.424 :** ఇది పాప్రికా రకము. మొక్కలు గుబురుగా పెరుగును. కాయలు 10-12 సెం.మీ. పొడవుతో లావుగాను, నిగారింపైన ఎరుపురంగు కలిగి ఉండును. వరంగల్లు లోకల్ కన్నా ముందుగా కోతకు వచ్చును. ఎగుమతికి అనుకూలమైన రకము.

**యల్.సి.ఎ.436 :** ఇది పాప్రికా రకము. కారం లేకుండా ఎక్కువ రంగు కల్గి ఉంటుంది. మొక్కలు మధ్యస్త పొడవుతో కొద్దిగా ప్రక్కలకు పెరుగుతుంది. కాయలు 8-9 సెం.మీ. పొడవు కలిగి లేత ఆకుపచ్చ రంగులో వుంటాయి. పండిన కాయలు ఆకర్షణీయమైన ఎరుపు రంగు కల్గి ఉంటాయి. కాయ దిగుబడి హెక్టారుకు 45-46 క్వింటాళ్ళు వస్తుంది.

**విత్తటం :** ఖరీఫ్ జులై - ఆగష్టు. రబీ : అక్టోబరు - నవంబరు.

**నాటటం :** 6 వారాల వయస్సుగల మొక్కలు నాటటానికి అనుకూలం. వర్షాధారపు పైరుకు 60×15 సెం.మీ. దూరంలో పాదుకు రెండు మొక్కల చొప్పున, నీటి వసతి కింద 60×60 లేదా 75×60 లేదా 90×60 సెం.మీ.ల ఎడం చొప్పున పాదుకు ఒక మొక్క చొప్పున నాటుకోవాలి. సూటి రకాలైతే పాదుకు 2 మొక్కలు, సంకర రకాలైతే పాదుకు ఒక మొక్క చొప్పున నాటాలి.

**నీటియాజమాన్యం :** తేలిక నేలలలో 7-10 రోజులకు, బరువు నేలల్లో 10-15 రోజులకొకసారి నీరివ్వాలి.

వేసవిలో 5-6 రోజులకొకసారి నీరివ్వాలి.

మిరప కోతకి వచ్చిన ప్రతిసారి ఒక నీటి తడివ్వాలి. నేలలో ఉన్న తేమను బట్టి మిరప పంటలో పూత దశ మరియు కాయ ఎదిగే దశలు ఎంతో కీలకమైనవి. ఈ సమయంలో నీటి ఎద్దడి రాకుండా చూసుకోవాలి. ఈ దశలో అధిక నీరు పారుదల పూతను, దిగుబడిని తగ్గిస్తుంది. శిలీంధ్ర వ్యాధులు రావడానికి ఎక్కువ అవకాశం ఉంటుంది. మొక్క పోషకాలను అందుకోకుండా చేస్తుంది. తక్కువ నీటి పారుదల వలన పూత మరియు కాయ రాలి పోవడం జరుగుతుంది. తక్కువ కొమ్మలు ఏర్పడతాయి.

**మల్చింగ్** : నల్లటి ప్లాస్టిక్ మల్చ్‌ను ఉపయోగించడం వలన కలుపు నివారణ చేయవచ్చు. ఈ మల్చింగ్ వలన మొక్క ఏపుగా పెరుగుతుంది. ప్రాథమిక శాఖలు, ఆకుల సంఖ్య పెరిగి చివరిగా వీటన్నిటి వలన మంచి దిగుబడి వస్తుంది, మల్చింగ్ ఉపయోగించిన పంటలో ఎప్పుడైతే కాయలు పరిణితి ఆకుపచ్చ దశలో ఉంటాయో అవి విటమిన్ -C ని అధిక మోతాదులో కలిగి ఉంటాయి. ఈ విధంగా పెంచిన మొక్కల కాయలలో పత్రహరితం-A, పత్రహరితం-B మరియు మొత్తము పత్రహరిత పదార్థంని కలిగి ఉంటాయి. మరియు ఒక మొక్క నుండి వచ్చే కాయల సంఖ్య కూడా పెరుగుతుంది. ఈ యొక్క మల్చింగ్ వలన కాయ యొక్క పొడవు మరియు వెడల్పుపై ఎటువంటి ప్రభావితం చూపదు. కాబట్టి ఉష్ణ మండలంలో ఇటువంటి మల్చ్‌ను ఉపయోగించి మిరప ఉత్పత్తిని పెంచడం అనేది ఒక ఆచరణీయ సాధనంగా కనిపిస్తుంది.

**అంతరకృషి:** నాటే 1,2 రోజుల ముందు ఫ్లుక్లోరాలిన్ 45% ఎకరాకు ఒక లీటరు చొప్పున పిచికారీ చేసి భూమిలో కలియదున్నాలి లేదా పెండిమిథాలిన్ 30% ఎకరాకు 1.3 లీ. లేదా ఆక్సిఫ్లోరోఫిన్ 23.5% 200 మి.లీ. చొప్పున ఏదో ఒకదానిని 200 లీ. నీటిలో కలిపి నాటే 1 లేదా 2 రోజుల ముందు పిచికారీ చేయాలి. నాటిన 25, 30

రోజుల తర్వాత 15, 20 రోజుల వ్యవధిలో అవసరాన్ని బట్టి గొర్రు, గుంటకలతో అంతరకృషి చేయాలి.

**ఎరువులు:** ఎకరాకు 10 టన్నుల పశువుల ఎరువు వాడాలి లేదా పచ్చిరొట్ట పైరును పెంచి భూమిలో కలియదున్నాలి. వర్షాధారపు పైరుకు 60-40-50 కిలోల నత్రజని, భాస్వరం, పొటాష్ ఇచ్చు ఎరువులను ఒక హెక్టారుకు వాడాలి. ఆరుతడి పైరుకు 300-60-120 కిలోల నత్రజని, భాస్వరం, పొటాష్ నిచ్చు ఎరువులను వేయాలి.

**ఎరువుల యజమాన్యం:**

జింకు ధాతలోప నివారణకు ఆఖరు దుక్కిలో ఎకరానికి 20 కిలోల జింకు సల్ఫేట్ వేయాలి. పంటకాలంలో జింకులోప నివారణకు లీటరు నీటికి 2 గ్రా. జింకు సల్ఫేట్ మరియు బోరాన్ లోప నివారణకు లీటరు నీటికి 1 గ్రా. బోరాక్స్ / బోరిక్ యాసిడ్ చొప్పున కలిపి 2-3 సార్లు పంటపై సాయంత్రం వేళల్లో పిచికారి చేయాలి. లీటరు నీటికి 3 గ్రా. సూక్ష్మపోషక మిశ్రమాన్ని కలిపి నెలకు ఒకసారి పిచికారీ చేసి సూక్ష్మపోషక లోపాలను నివారించుకోవచ్చు.

జీవన ఎరువులైన ఆజోస్పిరిల్లమ్, అజటోబాక్టర్, పి.యస్.బి., మైకోరైజాలను ఎకరానికి 2 కిలోల చొప్పున వేసినట్లయితే మొక్కలకు కావలసిన స్థూల / సూక్ష్మ పోషకాలు అందించడంలో దోహదపడతాయి మరియు రసాయన ఎరువుల వాడకాన్ని 25 శాతం వరకు తగ్గించవచ్చు.

**కోత మరియు దిగుబడి:**

ప్రధాన పొలంలో నాటిన రెండు నెలలకు పూత రావడం మొదలవుతుంది. పూత వచ్చిన నెలకు దిగుబడి మొదలవుతుంది ఎండు మిరప అయితే 5 నుండి 6 సార్లు కోతకు వస్తుంది పచ్చి మిరప అయితే 8-10 సార్లు కోతకు వస్తుంది. పచ్చి మిర్చి కోతకు బాగా పక్వానికి వచ్చిన కాయలను రంగు తిరగక ముందే కొయాలి. రకం, పంట వేసే సమయం మరియు వాతావరణ పరిస్థితులను బట్టి మిరప పంటకాలం సూమారు 150-180 రోజులు.

ఎండు మిర్చి కొరకు కాయలను రంగు తిరిగిన వెంటనే కోసినట్లయితే ఎండిన తర్వాత తొడిమ ముడత పడక, కాయలకు మంచి నిగారింపు వస్తుంది. కాయ మొక్క మీద ఆర పండినట్లయితే కాయ పండినవెంటే ముడతలు పడి నాణ్యత కోల్పోతుంది. కాయలు పండిన తర్వాత ఎక్కువ కాలం మొక్క మీదే ఉంచినట్లయితే, ఎండిన తర్వాత పాలిపోయినట్లు కనిపిస్తాయి. కాయ నాణ్యత, దిగుబడులు పెరగాలంటే, వీలైనన్ని ఎక్కువ సార్లు కోతలు కొయ్యాలి. 2-3 కోతల కంటే 7-8 కోతలు కోసినప్పుడు అధిక దిగుబడులు వచ్చినట్లు పరిశోధనల్లో నిర్ధారించబడింది.

**కూరమిరప దిగుబడి:** 75-100 క్వి./హె

**ఎండు మిరప :** 20-25 క్వి./హె

**కోత - కోత అనంతరం జాగ్రత్తలు:**

- మొక్కల మీద పూర్తిగా పక్వానికి వచ్చి, రంగు తిరిగిన కాయల్ని వాతావరణం పొడిగా ఉన్న సమయాల్లో మాత్రమే కోయాలి.
- కాయల్ని మొక్క మీద మరీ ఎక్కువగా పండనిస్తే కాయలు ముడతలు పడడమే కాకుండా, సూర్యరశ్మి అధికంగా సోకి, రంగు తగ్గి నాణ్యత కోల్పోతాయి. కోసిన కాయల్ని రాశిగా పోసి, పట్టాతో ఒక రోజంతా

కప్పి ఉంచినట్లయితే, కాయలన్నీ సరిసమానంగా పండుతాయి.

- కాయలను పాలిథీన్ పట్టాలపై లేదా శుభ్రమైన కాంక్రీటు కళ్ళాలమీద ఆరబెట్టాలి. ఎట్టి పరిస్థితులలోను నేల మీద మరియు ఇసుక లేదా పేడ అలికిన కళ్ళాలపై కాయల్ని ఆరబెట్టకూడదు. కాయల్లో తేమ 10-11 శాతం వరకు వచ్చేలా ఎండబెట్టాలి.

**సస్యరక్షణ**

**కీటకాల నివారణ**

**తామర పురుగులు:** రెక్కల పురుగులు ఆకుల అడుగుభాగమున చేరి రసాన్ని పీల్చటం వల్ల ఆకుల అంచులు పైకి ముడుచుకొంటాయి. ఆకులు, పిందెలు రాగి రంగులోకి మారి పూత, పిందె నిలిచి పోతుంది. దీని నివారణకు ఎకరానికి ఫాసలోన్ 400 మిల్లీ లీటర్లు లేదా ఎసిఫేట్ 300 గ్రాములు లేదా ఫిప్రోనిల్ 400 మి.లీ. లేదా స్పైనోసాడ్ 75 మి.లీ. లేదా పెగాసస్ 300 గ్రాములు ఆకుల అడుగు భాగం బాగా తడిచేటట్లు పిచికారీ చేయాలి. నాటిన 15 మరియు 45వ రోజు ఫిప్రోనిల్ 0.3% గుళికలు ఎకరానికి 8 కిలోలు చొప్పున భూమిలో తగినంత తేమ ఉన్నప్పుడు మొక్కలకు అందజేయటం ద్వారా పై ముడతను నివారించుకోవచ్చు. ముందు జాగ్రత్త చర్యగా ఇమిడాక్లోప్రిడ్ మందుతో విత్తనశుద్ధి చేయాలి. రసాయన, సేంద్రియపు ఎరువుల సమతుల్యత పాటించాలి. పై ముడతతో బాటు క్రింది ముడత (తెల్లనల్లి) కూడా ఉంటే కార్బరిల్, ఎసిఫేట్ మరియు స్పైనోసాడ్ మందులు వాడకూడదు.

**కింది ముడుత (తెల్లనల్లి):** తెల్లనల్లి పురుగులు ఆకులరసాన్ని పీల్చటం వలన ఆకులు క్రిందికి ముడుచుకొని తిరగబడిన పడవ ఆకారంలో కనపడతాయి. ఆకుల కాడలు సాగి ముదురు ఆకుపచ్చగా మారతాయి. మొక్కల పెరుగుదల ఆగిపోయి లేత ఆకులు ముద్దకడతాయి. దీని నివారణకు ఎకరాకు డైకోఫాల్ ఒక లీటరు లేదా నీళ్ళలో కరిగే గంధకం 600గ్రా. పిచికారీ చేయాలి. సింథటిక్ పైరిత్రాయిడ్ మందులు వాడరదు. నత్రజని ఎరువులు తగ్గించాలి. పైముడత, క్రింద ముడత ఉధృతి ఒకేసారి గమనించినచో ఉధృతిని బట్టి ఎకరానికి జోలోన్ 400 మి.లీ. లేదా పెగాసస్ 300గ్రా. లేదా క్లోర్‌ఫెనాపైర్ 400 మి.లీ. పిచికారీ చేసుకోవాలి.

**పేను బంక:** పేనుబంక లేత కొమ్మల, ఆకుల అడుగున చేరి రసాన్ని పీల్చటం వలన పెరుగుదల తగ్గుతుంది. తియ్యటి పదార్థాన్ని విసర్జించటం వలన చీమల్ని ఆకర్షిస్తుంది. ఆకులు, కాయలు, నల్లటి మసిపూసినట్లుగా మారిపోతాయి. దీని నివారణకు ఎకరానికి మిథైల్ డెమెటాన్ 400 మి.లీ. లేదా ఎసిఫేట్ 300 గ్రా. లేదా ఇమిడాక్లోప్రిడ్ 60 మి.లీ పిచికారీ చేయాలి.

**పూత పురుగులు:** పూత పురుగు దోమ జాతికి చెందినది. పిల్ల పురుగులు మొగ్గలు, పూత, పిందెలను ఆశించి నష్టపరుస్తాయి. పురుగు సోకిన పూతలో అండాశయం తెల్లగా ఉబ్బుతుంది. అండాశయం తొలిచి చూస్తే ఈ ఈగ యొక్క పిల్ల పురుగులను, ప్యూపాలను గమనించవచ్చు. ఈ పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటే దాదాపు 40 శాతం వరకు మిరప పూత రాలిపోతుంది. ఈ పురుగు సోకిన ఎడల పూత ఎండి రాలిపోవడం వల్ల కాయలు ఏర్పడవు. ఏర్పడినా కాయలు గిడసబారి ఆకృతి మారిపోయి వంకరలు తిరిగి వుండటం వల్ల నాణ్యత కోల్పోయి మార్కెట్‌లో ధర పలకదు. దీని నివారణకు ట్రైజోఫాస్ ఎకరానికి 250 మి.లీ. పిచికారీ చేసి వారం రోజుల తర్వాత మరల క్లోరిపైరిఫాస్ 500 మి.లీ. లేదా కార్బోసల్ఫాన్ 400 మి.లీ. పిచికారీ చేసి ఈ పురుగును సమర్థవంతంగా అరికట్టవచ్చును.

**కాయతొలుచు పురుగు (పొగాకు లద్దె పురుగు, శనగ పచ్చపురుగు, పచ్చ రబ్బరు పురుగు):** లద్దె పురుగులు మొదటి

దశలో ఆకులను నష్టపరచి తర్వాత కాయల్లో చేరి గింజలను తినివేస్తాయి. పంటకు విపరీతమైన నష్టం వాటిల్లుతుంది. దీని నివారణకు ఎకరానికి థయోడికార్బ్ 200గ్రా. లేదా ఎసిఫేట్ 300గ్రా. లేదా క్లోరిపైరిఫాస్ 500 మి.లీ. లేదా క్లోరిఫిన్‌పైర్ 400 మి.లీ. లేదా స్పైనోసాడ్ 75 మి.లీ. లేదా క్వినాల్‌ఫాస్ 400 మి.లీ. పిచికారీ చేయాలి. సమగ్ర సస్యరక్షణ అవలంభించాలి. పెరుగుదల నియంత్రణకారులు నొవల్యూరాన్ 150 మి.లీ. లేదా డైఫ్లూబెంజురాన్ 200 గ్రాముల లాంటి మందులతో గ్రుడ్ల నుండి అప్పుడే బయటకు వచ్చే పిల్ల పురుగులను అరికట్టవచ్చును. విషపు ఎరల ద్వారా బాగా ఎదిగిన లద్దెపురుగులను నివారించవచ్చును. విషపు ఎరను 5 కిలోల తవుడు, 500 గ్రా. కార్బరిల్ లేదా 500 మి.లీ క్లోరిపైరిఫాస్, 500 గ్రాముల బెల్లంతో తగినంత నీటిని కలిపి తయారు చేయాలి. ఈ విధంగా తయారుచేసిన చిన్న చిన్న గుళికలను సాయంత్రం చేలో సమానంగా చల్లితే నెర్రలలో దాగి ఉన్న పురుగులు రాత్రులందు బయటకు వచ్చి తినటం వలన చనిపోతాయి.

కాయతొలుచు పురుగుల ఉధృతి, ఉనికిని గుర్తించటానికి ఎకరానికి కనీసం 4 లింగాకర్షణ బుట్టలు అమర్చాలి. ఎరలను మాత్రం 25 రోజుల కొకసారి మార్చాలి. వేసవిలో నిద్రావస్థలో ఉన్న పురుగులు బయట పడేలా లోతు దుక్కులు దున్నాలి. విచక్షణా రహితంగా పురుగు మందులు వాడరాదు. ఆకర్షణ పైర్లుగా, ఆముదం, బంతి మొక్కలు చేలోను వేసుకోవాలి. జీవనియంత్రణద్వారా శనగపచ్చ పురుగు నివారణకు హెచ్.ఎస్.పి.వి.ని, పొగాకు లద్దెపురుగు నివారణకు ఎస్.ఎస్.పి.వి.ని వాడాలి.

**తెగుళ్ళు:**

**నారుకుళ్ళు తెగులు:** లేత మొక్కల కాండం మెత్తబడి గుంపులు గుంపులుగా నారు చనిపోతుంది. దీని నివారణకు విత్తనం మొలకెత్తిన వెంటనే ఒకసారి, మరల వారంరోజులకు ఒకసారి, 3 గ్రా. కాపర్ ఆక్సిక్లోరైడ్ లీటరు నీటిలో కలిపి లేదా ఒక శాతం బోర్డోమిశ్రమంతో పిచికారీ చేయాలి. ఎత్తయిన నారుమడుల్లో నారును పెంచాలి. కిలో విత్తనానికి 3 గ్రా. చొప్పున కాప్టాన్‌తో గాని మాంకోజెబ్‌తో గాని, విధిగా విత్తనశుద్ధి చేయాలి. విత్తనం వత్తుగా విత్తకూడదు. నారుకుళ్ళు తెగులు కనపడిన వెంటనే తడులను ఆపివేయాలి.

**కుకుంబర్ మొజాయిక్ వైరస్:** ఇది పేనుబంక ద్వారా వ్యాప్తి చెందుతుంది. మొక్కలు గిడసబారి, ఎదుగుదల లోపించి పొట్టిగా వుంటాయి. ఆకుల్లో పత్రహరితం కోల్పోయి, ఆకారం మారిపోయి కొనలుసాగి మొజాయిక్ లక్షణాలు కనబరుస్తాయి. పూత, కాత ఉండదు.

**పీ నట్ బడ్ నెక్రోసిస్ వైరస్ (మొవ్వుకుళ్ళు తెగులు):** ఇది తామర పురుగుల ద్వారా వ్యాప్తి చెందుతుంది. నారుమళ్ళు మరియు సాలు తోటలలోను ఆశించి మొవ్వ లేదా చిగురు భాగం ఎండిపోతుంది. కాండంపై నల్లని నిర్థిష్ట ఆకారం లేని మచ్చలు ఏర్పడి క్రమేణా చారలుగా మారతాయి. ఆకులపై వలయాలుగా నెక్రోటిక్ మచ్చలు ఏర్పడి పండుబారి రాలిపోతాయి.

**యాజమాన్యం**

- వైరస్‌ను తట్టుకునే రకాలను సాగుచేసుకోవాలి.

- గట్లమీద వైరస్ క్రిములకు స్థావరాలుగా ఉన్న కలుపు మొక్కలను లేకుండా శుభ్రం చేసుకోవాలి.
- పొలం చుట్టూ 2-3 వరుసలు జొన్న గాని మొక్కజొన్న గాని రక్షక పంటగా వేసుకోవాలి.
- సేంద్రియ ఎరువులు వాడి సమతుల్య ఎరువుల యాజమాన్యము పాటించాలి.
- విత్తనశుద్ధి చేయాలి. ఒక కిలో విత్తనానికి 8గ్రా. ఇమిడాక్లోప్రిడ్ పురుగు మందుతో రసంపీల్చు పురుగుల నివారణకు, విత్తనం ద్వారా వ్యాపించే వైరస్ తెగులు నివారణకు ట్రైసోడియం ఆర్థో ఫాస్ఫేట్‌తో విత్తనశుద్ధి చేయాలి.
- వైరస్‌కు మందు లేదు కనుక వాటి వ్యాప్తికి దోహదపడే రసంపీల్చే పురుగులను నిర్మూలించి వైరస్‌ను సమర్థవంతంగా నిర్మూలించుకోవాలి.
- పొలంలో అక్కడక్కడ అయిల్ లేదా గ్రీజు పూసిన పసుపు రంగు అట్టలను లేదా రేకులకు ఉంచితే తెల్లదోమ ఉధృతిని తెలుసుకోవడంతో పాటు కొంత వరకు సంఖ్యను తగ్గించవచ్చు.
- వైరస్ సోకిన మొక్కలను పీకి కాల్చివేయాలి.
- పేనుబంక నివారణకు ఎసిఫేట్ 1.5గ్రా లేదా మిథైల్ డెమటాన్ 2 మి.లీ. లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.25 మి.లీ. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలి.
- తామర పురుగుల నివారణకు ఫిప్రోనిల్ 0.3 శాతం గుళికలు నాటిన 15 రోజులకు మరియు 45 రోజులకు ఎకరానికి 8 కిలోల చొప్పున భూమిలో తగినంత తేమ ఉన్నప్పుడు వేయాలి.
- ఎసిఫేట్ 1.5గ్రా. లేదా ఫిప్రోనిల్ 2 మి.లీ. లేదా స్పైనోసాడ్ 0.25 మి.లీ లేదా డైఫెన్‌థయురాన్ 1.5గ్రా. లేదా క్లోరోఫిన్‌పైర్ 2 మి.లీ. ఒక లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేసి తామర పురుగులను నివారించుకోవచ్చు.
- తెల్లదోమ నివారించుకోవడానికి 5 శాతము వేపగింజల కషాయం గాని ఎకరానికి 300 గ్రా. ఎసిఫేట్ గాని లేదా ట్రైజోఫాస్ 250 మి.లీ. లేదా థయోమిథాక్సాం 40గ్రా. మందులను మార్చి మార్చి 7-10 రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలి.

**మిరప కోతలు:** పంట దిగుబడి అధికంగా పొందటానికి చెట్టుపై పండిన కాయల్ని ఎప్పటికప్పుడు కోసి, పట్టాలపై కాని, సిమెంట్ కళ్ళాలపైనగాని ఆరబెట్టడం శ్రేష్ఠం. వర్షాధారపు పైరుకు 3-4 కోతలు, నీటి ఆధారపు పైరుకు 6-8 కోతలు కోయాలి.

**ఎగుమతి కొరకు మిరప నాణ్యతను పెంచటానికి సూచనలు :**

1. మొక్కల మీద మిరపకాయలను పండనీయరాదు. ఎక్కువగా పండితే మిరప నాణ్యత తగ్గుతుంది. తరుచుగా ఎప్పటికప్పుడు పండిన కాయలు కోయటం వలన దిగుబడులు పెరుగుతాయి.
2. కాయకోసే ముందు సస్యరక్షణ మందులు పిచికానీ చేయరాదు. పిచికారీ చేసిన ఎడల మిరప కాయలమీద అవశేషాలుండే ప్రమాదముంటుంది.
3. అఫ్లోటాక్సిన్ వృద్ధి కాకుండా మిరప కాయలను పాలిథీన్ పట్టాల మీద లేదా సిమెంట్ గచ్చుమీద ఎండబెట్టాలి.

4. రాత్రిళ్ళు మంచు బారిన పడకుండా కాయలను కప్పి ఉంచాలి.

5. మిరపలో 10 శాతానికి మించి ఎక్కువ తేమ ఉండకుండా ఎండబెట్టాలి.

6. ఎండబెట్టేటప్పుడు దుమ్ము, ధూళి, చెత్త, చెదారం చేరకుండా కాయలు శుభ్రంగా ఉండేటట్లు చూడాలి.

7. కాయలు ఎండబెట్టే దరిదాపుల్లో కుక్కలు, పిల్లులు, కోళ్ళు, ఎలుకలు మరియు పందికొక్కులు రాకుండా చూసుకోవాలి.

8. తాలు కాయలను, మచ్చకాయలను గ్రేడింగ్ చేసి వేరుచేయాలి.

9. నిల్వచేయడానికి తేమ లేనటువంటి శుభ్రమైన గోనె సంచుల్లో కాయలు నింపాలి.

10. తేమ తగలకుండా వరిగడ్డి లేదా చెక్క బల్లలమీద గోడలకు 50-60 సెం.మీ. దూరంలో నిల్వ ఉంచాలి.

11. అవకాశమున్నచోట శీతల గిడ్డంగుల్లో నిల్వచేస్తే రంగు, నాణ్యత తగ్గిపోకుండా లాభదాయకంగా ఉంటుంది.

12. కాయలు నిగనిగ లాడుతూ మంచి రంగు రావాలని ఏ విధమైన రసాయనాలను, రంగులను,వాడకూడదు. అవి ప్రమాదకరమేకాక నిషేధింపబడ్డాయి.

13. అకాల వర్షాలకు గురికాకుండా, మంచు బారిన పడకుండా, రంగుకోల్పోకుండా అధునిక డ్రయ్యర్లలోగాని లేదా టబాకో బారన్‌లలోగాని ఎండబెట్టి నాణ్యమైన మిరప కాయలను పొందవచ్చు.

**అంతర్జతీయ మిరప వాణిజ్యంలో వివిధ దేశాలు**

| | |
|---|---|
| భారతదేశం నుండి మిరప దిగుమతి చేసుకునే దేశాలు | శ్రీలంక, అమెరికా, కెనడా, ఇంగ్లాండు, సౌదీఅరేబియా, సింగపూర్, మలేసియా, జర్మనీ |
| మిరప ఉత్పత్తి చేసే దేశాలు | భారత్, చైనా, పాకిస్థాన్, మొరాకో, మెక్సికో, టర్కీ, బంగ్లాదేశ్ |
| ఎగుమతిలో భారతదేశానికి ముఖ్య పోటీదారులు | చైనా, పాకిస్థాన్, బంగ్లాదేశ్ |

**ఎగుమతికి అనుకూలమైన మిరప రకాలు**

అధిక మిరప గుజ్జునిచ్చే రకాలు - పూసాజ్వాల, బాడిగడబ్బీ, ఎల్.సి.ఎ.- 235, 334, 324, సింధూర్

అధిక రంగునిచ్చే రకాలు - ఎల్.సి.ఎ. - 206, 304, 305, 357, 424, సింధూర్

అధిక ఘాటు కలిగిన రకాలు - ఎల్.సి.ఎ. - 235, 324, 334, పూసాజ్వాల, అపర్ణ, పి.కె.ఎమ్.-1

**అమెరికా సుగంధ ద్రవ్యాల వాణిజ్యసంస్థ మిరప దిగుమతికి నిర్దేశించిన పరిశుభ్రత ప్రమాణాలు:**

పౌండు బరువుకు 4 చనిపోయిన కీటకాల అవశేషాలు, 1 మి.గ్రా. క్షీరదాల మలం, 3% బూజు బరువు, 2.5% కీటకాలు ఆశించి నష్టపడ్డ భాగం, 0.5% ఇతర కలుపబడిన పదార్థాలు ఈ పరిమితికి మించి ఉండరాదు.

**మిరపలో ఎగుమతికి పాటించవలసిన నాణ్యతాప్రమాణాలు**

| భాగం | పధార్ధం | పరిమితి |
|---|---|---|
| మిరపకాయలు | ఇతరపదార్థాలు | 5 శాతం వరకు |
| | కీటకాల నష్టం | 5 శాతం వరకు |
| మిరపపొడి | బూడిద | 1.3 శాతం వరకు |
| | పీచుపదార్ధం | 3.0 శాతం వరకు |
| | నూనె | 2 శాతం వరకు |

**కాప్సిసిన్ ఆధారంగా మిరపరకాల వర్గీకరణ**

| పరిధి (%) | కేటగిరి | రకాలు |
|---|---|---|
| 1.00 (>) | ఎక్కువ | సీమమిరప, తెల్లసీమమిరప, నైజీరియన్ చిల్లీ |
| 0.76-1.00 | మధ్యస్థం నుండి ఎక్కువ | కె2, జవహర్ |
| 0.51-0.75 | మధ్యస్థం | జి4, జ్వాల, ముసత్వాడి |
| 0.26- 0.50 | తక్కువ నుండి మధ్యస్థం | యల్.సి.ఎ.-235, జి-4,జి-5, యల్.సి.ఎ.-334, యల్.సి.ఎ-353 |
| 0.10-0.25 | తక్కువ | సింధూర్, ఎల్.సి.ఎ. - 206, యల్.సి.ఎ.-424, యల్.సి.ఎ- 436. |

మిరప సాగుపై మరిన్ని వివరాలకు సంప్రదించవలసిన చిరునామా
**సీనియర్ సైంటిస్ట్ (హార్టికల్చర్) మరియు హెడ్, ఉద్యాన పరిశోధనా స్థానం,**
మల్యాల్ - 506101, వరంగల్ జిల్లా. ఫోన్: 08719-240950.